క్లుప్తంగా

ర్యాగింగ్‌పై అవగాహన

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని ప్రభుత్వ కళాశాలల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చావల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తోటి విద్యార్థులను సీనియర్లమంటూ ర్యాగింగ్ చేస్తే చట్టపర చర్యలు ఉంటాయన్నారు. ఆయా కళాశాలల్లో యాంటి ర్యాగింగ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు.

షట్టర్ ఏర్పాటు చేయాలి

అశ్వాపురం: మండలంలో ప్రధాన సాగునీటి వనరైన 10వేల ఎకరాల ఆయకట్టు కలిగిన తుమ్మలచెరువు పెద్ద తూము మరమ్మతులకు గురైందని, వెంటనే షట్టర్ ఏర్పాటు చేయాలని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మొండికుంటలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుమ్మలచెరువులో 17 అడుగులు నీరు వచ్చి ఖరీఫ్ డోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్న సమయంలో ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో తుమ్మలచెరువు తూము మరమ్మతులకు గురైందన్నారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన తూము షట్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

సమస్యలపై సమావేశం

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలోని ప్రధాన సమస్యలపై, కొంతమంది స్థానిక యువకుల ఆధ్వర్యంలో చర్చలతో కూడిన సమావేశాన్ని ఆదివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా దమ్మపేట బస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణం పూర్తిగా నిలిపివేయడం, వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయినేజీలో పూడికతీతలు, అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. పరిష్కారానికి గ్రామస్తులంతా ఏకతాటిపై ఉండాలని నిర్ణయించారు. మాడా లక్ష్మీనారాయణ, దారా మల్లికార్జునరావు, చక్కిరాల మల్లేశ్వరరావు, ఎస్‌కె.రహీం, యార్లగడ్డ శ్రీను, పగడాల రాంబాబు, భవానికృష్ణ, రఘు పాల్గొన్నారు.

రహీం పాషాకు సన్మానం

మణుగూరుటౌన్: మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన రహీంపాషాను మండల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రజాభవన్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు మిఠాయిలు తినిపించి పుష్పగుచ్ఛం అందించారు. శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పల్లం నాగేశ్వరరావు, బొట్ల రామకృష్ణ, ధూళిపాళ భాస్కర్‌రావు, సాయి, చింటు, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బిట్రా జగంబరావు భార్య రాధ అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె మృతదేహానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయగాంధీ, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తెల్లం వీరభద్రం, వల్లెపోగు బాబు, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.18 వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ కోశాధికారి పద్మ

చర్ల: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనాన్ని ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన చర్లలో జరిగిన ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) చర్ల మండల మహాసభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వరలక్ష్మి, సుజాతలతో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాగమణి, సూర్యకాంతం, దేవమణి, విజయరాణి, సుశీల, ముత్యాలక్క, కుమారి, కనక తదితరులు పాల్గొన్నారు.

ఫైన్ విధానం వద్దు

మణుగూరుటౌన్: ఏరియాలో నాన్ సివిల్ (లోకల్ టెండర్స్) ద్వారా పనులు చేస్తున్న కార్మికులపై ఫైన్ విధానం రద్దు చేయాలని ఏఐటీయూసీ మణుగూరు సెక్రటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీజీఎం రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత నెల 9 దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ వేశారని, ఆ ఫైన్‌ను రద్దు చేసి తిరిగి చెల్లించాలన్నారు. యూజర్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రతి నెలా వేతనాలు సకాలంలో ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఆదర్ల సురేందర్, శనిగరపు కుమారస్వామి, అవినాష్, ప్రవీణ్, రవి, వీరబాబు తదితరులు ఉన్నారు.

'మూకమామిడి' పర్యాటకమయ్యేనా?

- మిగిలిపోయిన మరమ్మతు పనులు
- మినీ ట్యాంక్ బండ్‌గా చర్యలకు స్థానికుల డిమాండ్
- చొరవచూపుతున్న ఎమ్మెల్యే జారె



ఇటీవల వర్షాలకు అలుగుపోస్తున్న మూకమామిడి ప్రాజెక్ట్

ములకలపల్లి: మండలపరిధిలోని మూకమామిడి ప్రాజెక్ట్ పర్యాటక ప్రదేశంగా అభివృద్ధిపై స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 45 క్రితం నిర్మించిన ఈ మధ్యతరహా జలాశయాన్ని మినీ ట్యాంక్ బండ్‌గా ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అసెంబ్లీలో ప్రస్తావించడంతో ఆ దిశగా ఇకనైనా అడుగులు ముందుకు సాగుతాయని ఆశిస్తున్నారు.

ఎంతో చరిత్ర..

3,360 ఎకరాల ఆయకట్టు భూమి సాగే లక్ష్యంగా 1976 జూన 4న నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 1979 మార్చి 4న సీఎం మర్రి చెన్నారెడ్డి దీనిని ప్రారంభించారు. కుడి కాలువ ద్వారా 2,160 ఎకరాలకు, ఎడమ కాలువల ద్వారా 1,200 ఎకరాల 15 గిరిజన గ్రామాల ప్రజల భూములను నీళ్లందిస్తున్నారు. ఐతే ప్రాజెక్ట్ శిథిలావస్థకు చేరడంతో ఆఖరి ఆయకట్టు భూములను నీళ్ల అందడంలేదు. విస్తారంగా పూడిక పేరుకుపోవడంతో వెయ్యి ఎకరాలకు కూడా నీళ్లు పారని దుస్థితి నెలకొంది.

రూ.9 కోట్లు వెచ్చించినా ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్ఆర్ఆర్ పథకంలో రూ.21 కోట్లతో ప్రాజెక్ట్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపగా.. రూ.9 కోట్లు మంజూరయ్యాయి. వీటితో రెండు తూములను పూర్తిగా తొలగించి, నూతనంగా నిర్మించి షెట్టర్లు ఏర్పాటు చేశారు. అయితే ఒక తూములోని షెట్టర్ నీళ్లలోనే ఇరుక్కుపోవడంతో. మరోమారు రిపేరు చేశారు. అలుగు మరమ్మతులు చేశారు. కాలువల్లో సిల్ట్ తొలగించి, కాంక్రీట్ కాలువలు నిర్మించారు. అయితే ప్రధాన చెరవులోని పూడిక తీత, చెరువు కట్ట బలపర్చడం వంటి ఇతరత్రా పనులేవీ చేయకపోవడంతో నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. గట్టిగా వానలు కురిస్తే పూర్తి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎస్) 36 అడుగులు నిండి అలుగు పోస్తోంది. ఆ తదరుపరి ఎండలకు ఎండిపోతోంది. వానొస్తే జలకళ లేదంటే వెలవెల అన్నట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి.

ఎమ్మెల్యే చొరవతోనైనా..

మూకమామిడి ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పలుమార్లు ప్రకటించిన విషయం విదితమే. మినీట్యాంక్ బండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ ఇరిగేషన్ అధికారులను ఆదేశించి, నిధుల కేటాయింపు కోరుతూ అసెంబ్లీలో సైతం ప్రస్తావించడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమంలో ఇకనైనా ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో రిపేర్లు చేస్తారని, చక్కటి పర్యాటక ప్రాంతంగా మారుతుందని ఎదురు చూస్తున్నారు.

పూడిక తీయాలి



పూడిక పెరిగిపోవడంతో చివరి భూములను నీళ్ల అందట్లేదు. దీంతో పలువురు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సిల్ట్ తీయడంతోపాటు, ట్యాంక్‌బండ్‌లా మారిస్తే చక్కటి పర్యాటక ప్రాంతమవుతుంది.

– కుర్సం భద్రయ్య, ఆయకట్టు రైతు, మొండికుంట

ప్రతిపాదనలు సమర్పించాం..



రూ.5.5 కోట్ల వ్యయంతో ట్యాంక్‌బండ్ నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. వీటితో కట్ట బలపర్చడం, పూడిక తీతతోపాటు, బతుకమ్మ ఘాట్ నిర్మాణం, బోటింగ్, వాక్ వే, పార్క్‌లా నిర్మించి పిల్లలకు ఆట వస్తువులు సమకూర్చునున్నాం.

– గపూర్ పాషా, ఇరిగేషన్ ఏఈ

మరోమారు సీఎంకు విన్నవిస్తా..



మూకమామిడి ప్రాజెక్టున్‌ను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశాం. మరోమారు సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించి, త్వరితగతిన నిధుల మంజూరీకి కృషి చేస్తా.

– జారె ఆదినారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

చర్ల: చర్ల మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చర్లకు వచ్చే ప్రధాన రహదారులలో మోహరించిన పోలీసు బలగాలు.. ఆదివారం చర్లలో జరిగిన వారపు సంతకు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుంటారు. వారి మాటున మావోయిస్టులు, సానుభూతిపరులు, కొరియర్లు, మిలీషియా సభ్యులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తనిఖీలను కొనసాగించారు. పలువురు ఆదివాసీ అనుమానితులను విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు.

సీపీఐ నేతకు నివాళి



సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన అంతిమ దర్శనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

మట్టి గణపతినే పూజించండి




భద్రాచలంటౌన్: కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, తదితరులు

భద్రాచలంటౌన్: పర్యవరణానికి హాని చేయని మట్టి గణపతుల విగ్రహాలనే పూజించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. భద్రాచలం కుమ్మర సంఘం- శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతినే పూజిద్దాం అనే కరపత్రాన్ని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉందని, లేకుంటే ప్రకృతి ప్రళయానికి ఎవరైనా శిరస్సు వంచాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ భద్రాచలం బాధ్యులు గంగాధర వీరయ్య, భద్రాచలం కుమ్మరి సంఘం డివిజన్ నాయకుడు విజ్జిగిరి రాజా కిరణ్, గంగాధర సతీష్, సద్దనపు సత్యనారాయణ, వి. నరేష్, జల్లారపు సునీల్, సగ్గెం లక్ష్మణరావు, రెల్లి తాతారావు, కొలిచలం నవీన్, విజ్జిగిరి రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మట్టి గణపతి ప్రతిమలకు పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కోరారు. ఆదివారం పట్టణంలోని సురక్షాబస్టాండ్ ప్రాంగణంలో సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలకే పూజించాలంటూ ముద్రించిన కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీరం సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. ప్రకృతి, పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతిని కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఉపేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ పోటీల్లో ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబరిచిన అన్నదమ్ములు సురేష్, ప్రవీణ్, అనిల్

అశ్వాపురం: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఎన్ఎండీసీ మారథాన్ పోటీల్లో మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రతిభ కనబరిచారు. ఖైరతాబాద్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు 42.5 కిలోమీటర్లు మారథాన్ పరుగులో గోపాలపురం గ్రామానికి చెందిన కరణం సురేష్, అనిల్, ప్రవీణ్‌లు 4.48 గంటల్లో పూర్తి చేశారు. సురేష్ పోలీస్ కానిస్టేబుల్‌గా, ప్రవీణ్ సీఐఎస్ఎఫ్ సభ్యుడిగా, అనిల్ ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు.

'సామే కొత్తల' పండుగ



మొక్కులు చెల్లించుకుంటున్న పోలెబోయిన, పులి వంశస్థులు

కరకగూడెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఆదివాసీల సాంప్రదాయ పండుగ సామే కొత్తల (పాట్ట పండుగ)ను ఘనంగా నిర్వహించారు. కోయ ఆదివాసీల పూర్వపెద్దల ఆనవాయితీ ప్రకారం మగమొదటి పాదం సందర్భంగా ఆదివారం పోలెబోయిన, పులి వంశస్థులు ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరిపారు. గ్రామంలోని ముసలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం కోయతూర్ సాంప్రదాయ నృత్యాలు, గట్టు గోత్రాల ఆచారాలు, తాళమేళ మద్దెల వాయిద్యాలతో ఉత్సవ వాతావరణం నెలకొంది. తమను పోషించే ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్వీకుల ఆశీస్సులను కోరుతూ ఆదివాసీలు ఈ పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలెబోయిన బాబు, వెంకటయ్య, సత్యం, లక్ష్మయ్య, పులి నారాయణ, రామూర్తి, పులి రామకృష్ణ, సమ్మయ్య, బాలకృష్ణ,రవి, కృష్ణ, సారయ్య, రాంగోపాల్, కార్తీక్, రాజు, సిద్ధు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో మట్టికుప్పలు



మట్టి కుప్పలతో దర్శనమిస్తున్న మైదానం

మణుగూరుటౌన్: పట్టణంలోని ఏరియా స్టోర్స్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ గ్రౌండ్ మట్టి కుప్పలతో దర్శనమిస్తుండటంతో క్రీడాభిమానులు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 21న అదే మైదానంలో సింగరేణి పర్యావరణ అనుమతుల నిమిత్తం సింగరేణి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో సభకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా అక్కడక్కడా ఉన్న గుంతలను చదును చేసింది. ఈ నేపథ్యంలో సభ అనంతరం శామియానాలు తొలిగించే క్రమంలో మట్టి కుప్పలు ఏర్పాటు చేసి తొలిగించడం మరిచారు. దీంతో పట్టణానికి ఉన్న ఒక్క మైదానం కూడా ఇలా మట్టి కుప్పలతో దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సింగరేణి అధికారులు దృష్టి సారించి ట్రాక్టర్ డోజర్‌తో మట్టి కుప్పలను తొలిగించి ఆటలకు ఆటంకం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జీపు జాతా ప్రారంభం



జీపు జాతా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న శివ ప్రశాంత్

భద్రాచలంటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ విద్యార్థి పోరుబాట (జీపు జాతా) యాత్రను ఆదివారం భద్రాచలం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలను నడిపిస్తూ ఫీజుల దోపిడీ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు విద్య వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్, శ్రావణి, మనీ, భార్గవి, విష్ణువర్ధన్, షేక్ అబ్దుల్, గని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ అత్యాచారంతో సంబంధం లేదు..

చర్ల: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ మైనర్ బాలికను చర్ల ఆటోడ్రైవర్లు ఎక్కించుకుని దుమ్ముగూడెం మండలంలో అత్యాచారం చేశారని మీడియా(సాక్షి కాదు)లో వచ్చిన వార్తలు అవాస్తమని చర్ల మండల శ్రీ గణేష్ ఆటో యూనియన్ పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఆ ఘటనతో చర్లకు గాని, చర్ల ఆటోడ్రైవర్లకు గానీ ఏ సంబంధమూ లేదని తెలిపింది. ఈ మేరకు ఆదివారం చర్లలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పామారు బాలాజీ, యూనియన్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. చర్ల మండలానికి చెందిన ఆటో డ్రైవర్లపై బురదజల్లే విధంగా తప్పుడు వార్తలను ప్రచురించి, ప్రచారం చేసిన మీడియా సంస్థల తీరును ఖండించారు. వేరే ప్రాంతంలో జరిగిన సంఘటనను చర్ల మండలానికి చెందిన ఆటో డ్రైవర్లు ఆపాదించడం సరికాదన్నారు. ఆదివాసీ మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన దోషులను వెంటనే గుర్తించి, వారిపై కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!



వరదతో కోతకు గురైన బీటీ రహదారి



కొట్టుకుపోయిన బీటీ రోడ్డు అప్రోచ్

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో ఓ ప్రధాన రహదారి కోతకు గురయ్యి.. ప్రమాదకరంగా మారింది. మండలంలోని నారంవారిగూడెం గ్రామ శివారులో బీటీ రహదారి భారీ, వరద కారణంగా భారీగా కోతకు గురైంది. బీటీ రోడ్డు దాదాపు రెండు వందల మీటర్ల మేర కోతకు గురై రోడ్డు కొట్టుకుపోయింది.

అదే విధంగా కల్వర్టు వద్ద ఉన్న సీసీ రోడ్ అప్రోచ్ రోడ్డు ఒక వైపు పూర్తి కోతకు గురై కల్వర్టు పైపులు బయటపడ్డాయి. దీంతో ఈ మార్గం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో వాహనదారులు అదుపుతప్పితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. తక్షణమే పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టించుకోని కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పొలంబాటతో భద్రత

- క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు పరిష్కారం
- రైతులకు ప్రమాదాలపై అవగాహన



కరకగూడెంలో రైతులకు విద్యుత్ పట్ల జాగ్రత్తలు వివరిస్తున్న ఏడీఏ ఉమారావు

కరకగూడెం: వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర విద్యుత్ శాఖ 'పొలం బాట'అనే ప్రత్యేకమైన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా పొలాల వద్దకు వెళ్లి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం తద్వారా రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నారు. దీనిద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం కార్యక్రమ లక్ష్యాల్లో భాగం.


పొలంబాట ముఖ్య లక్ష్యాలు..

- పొలాల వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, మోటార్లలోని సమస్యలను గుర్తించడం.
- రైతులకు తక్కువ వోల్టేజ్ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడం.
- విద్యుత్ ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించడం.
- రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం.
- విద్యుత్ అధికారులకు, రైతులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి మెరుగైన సంబంధాలను ఏర్పరచడం.

కార్యక్రమ విధివిధానాలు..

- పొలం బాట కార్యక్రమం చాలా పద్ధతిగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమం వల్ల రైతులు పొందే లాభాలు కూడా గణనీయం.
- విద్యుత్ అధికారులు సిబ్బంది ప్రతిరోజూ రైతు పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్లు, సర్వీస్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలిస్తారు.
- వదులుగా ఉన్న తీగలు, విరిగిపోయిన స్తంభాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సమస్యలను గుర్తిస్తారు.
- గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు. పెద్ద సమస్యల విషయంలో ఉన్నతాధికారులకు నివేదించి, వేగంగా చర్యలు తీసుకుంటారు.
- అధికారులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు ఇస్తారు.
- రైతులు తమ పొలాల్లో మోటార్లను వాడేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తల గురించి వివరిస్తారు.
- టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా సమస్యలను నివేదించే సౌకర్యం ఏర్పాటు చేశారు.
- కొత్త ఉపకేంద్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ లైన్లను ఏర్పాటు చేస్తారు.


పొలాల కాడికొచ్చి జాగ్రత్తలు చెప్తున్నారు..



పొలం బాట కార్యక్రమం మాకు నిజంగా చాలా ఉపయోగపడుతుంది. గతంలో మోటారు కాలిపోతేనో కరెంటు సరిగా రాకపోతేనో ఆఫీస్ చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు కరెంట్ సారు వాళ్లే స్వయంగా మా పొలాల కాడికి వచ్చి అన్నీ చూసిపోతున్నారు. మొన్న మా మోటారు దగ్గర వోల్టేజ్ తక్కువగా ఉందని సారు గుర్తించి వెంటనే లైన్‌లో ఉన్న చిన్న సమస్యను పరిష్కరించారు.

– నాలి రాంబాబు, రైతు, కరకగూడెం

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం..



'పొలం బాట' కార్యక్రమం రైతుల సమస్యలను నేరుగా అర్థం చేసుకోవడానికి ఒక మంచి అవకాశాన్ని కల్పించింది. గతంలో రైతులు విద్యుత్ సమస్యల కోసం మా ఆఫీసులకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు మేమే స్వయంగా పొలాల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇది మాకు కూడా చాలా సంతృప్తిగా ఉంది. విద్యుత్ భద్రత గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఉమారావు, ఏడీఏ, మణుగూరు